క్లుప్తంగా

కేంద్ర హోం మంత్రి వ్యాఖ్యలు అనుచితం



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ధర్మవరం: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మీద చేసిన అనుచితమని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త యనుమల నరేష్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.

అనాథలు, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రాజేంద్రనగర్‌లోనున్న అనాథ ఆశ్రమంలో గురువారం లలిత నాట్య కళానికేతన్ గురువు బాబు బాలాజి అనాథలు, వృద్ధులకు దుప్పట్లు అందించారు. తన పెద్ద కుమార్తె హర్షశ్రీ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానంతో పాటు దుప్పట్లు పంపిణీ చేశామని బాబు బాలాజీ తెలిపారు. కార్యక్రమంలో నాట్య కళానికేతన్ గురువు బాలాజితోపాటు కుమార్తెలు హర్షశ్రీ, రామలాలిత్య పాల్గొన్నారు.

21న జగన్ జన్మదిన వేడుకలు

కదిరి టౌన్: ఈనెల 21న వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ గురువారం తెలిపారు. ఈసందర్భంగా పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నియోజవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీగా తరలివచ్చి రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా



జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు

పుట్టపర్తి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్‌మేళా నిర్వహించారు. ఈసందర్భంగా మూడు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 20 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మక్బుల్ హుస్సేన్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మలమీదపల్లిలో రెవెన్యూ సదస్సు

గాండ్లపెంట: మలమీదపల్లిలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 16 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూమి సాగు చేసుకుంటున్న రైతులు అసైన్‌మెంట్ కోసం విన్నవించుకున్నారన్నారు. రైతుల వినతులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబురావు, ఆర్‌ఐ జాఫర్, రాజేంద్ర, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆరుద్ర శ్రీనివాసులుకు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ఆరుద్ర శ్రీనివాసులు

తనకల్లు: గందోడివారిపల్లికి చెందిన జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఆరుద్ర శ్రీనివాసులు గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళాపరిషత్, అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ వారు గురువారం విజయవాడలో గౌరవ డాక్టరేట్‌ను అందజేసినట్లు శ్రీనివాసులు తెలియజేశారు. సాహిత్యంలో చేసిన సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారన్నారు.

రైతుల ఆశలు పండేనా!

- కుడికాలువకు అరకొర నీరు
- చెరువులు పూర్తిగా నిండుతాయో లేదోనని సందేహం



పీఏబీఆర్ కుడి కాలువలో అరకొరగా వస్తోన్న నీరు

తాడిమర్రి: మండలంలోని చెరువులు నింపడానికి ప్రభుత్వం విడుదల చేసిన పీఏబీఆర్ కుడికాల్వ నీరు అరకొరగా వస్తోంది. దీంతో రైతులు చెరువులు పూర్తిస్థాయిలో నిండుతాయో లేదోనని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పీఏబీఆర్ కుడి కాలువ పరిధిలో నార్శింపల్లి, నిడిగల్లు, తాడిమర్రి తూర్పు, పడమర చెరువులు, ఎం.అగ్రహారం చెరువులు ఉన్నాయి. వీటి కింద సుమారు 750 ఎకరాల వరకు సాగు భూమి ఆయకట్టు ఉంది. అలాగే ఏకపాదంపల్లి, పుల్లానారాయణపల్లి, మేడిమాకులపల్లి గ్రామాల్లో కుంటలు ఉన్నాయి. ఈ కుంటలు నిండటంతో సుమారు 150 ఎకరాలు సాగులోకి వస్తాయి. అలాగే శివంపల్లి, తాడిమర్రి, మోదుగులకుంట, బంగారంపేట, చిల్లకొండయ్యపల్లి, మర్రిమాకులపల్లి తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరగనున్నాయి.

వారం రోజులు ఆలస్యంగా..

సాధారణంగా ఏటా నవంబర్ 25 తేదీన విడుదల చేసేవారు. అయితే కూడేరు మండలం అరవకూరు వద్ద కాలువ మరమ్మతు నేపథ్యంలో వారం రోజులు ఆలస్యంగా(ఈనెల 2న) విడుదల చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 5వరకూ నీరు వదిలే అవకాశం ఉంది. పీఏబీఆర్ నీటితో 50 శాతం మాత్రమే చెరువులు నింపనున్నట్లు సమాచారం. తొలుత 250 క్యూసెక్కులు విడుదల చేసి తర్వాత 550 క్యూసెక్కులు సరఫరా చేస్తు వచ్చారు. బుధవారం(ఈనెల 18 నుంచి) 650 క్యూసెక్కులకు పెంచి నీటిని సరఫరా చేస్తున్నారు. త్వరలో నీటి విడుదలను 700 క్యూసెక్కులకు పెంచనున్నట్లు సమాచారం.

విస్తారంగా పండ్లతోటలు..

మండలంలో చీనీ, మామిడి, అరటి, జామ తదితర పండ్లతోటలు సాగు అవుతున్నాయి. ఇరిగేషన్ అధికారులు ఏటా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 41 చెరువులు నింపడానికి ఏటా నవంబర్‌లో పీఏబీఆర్ కుడికాల్వ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. జిల్లా సరిహద్దులోని తాడిమర్రి మండల చెరువులకు నింపిన అనంతరం బత్తలపల్లి, అనంతపురం మండలాల్లోని చెరువులను నింపాల్సింది. అయితే ఏ ఏడాదికి ఆ ఏడు వర్షపాతం పడిపోతూనే ఉంది. దీంతో రాప్తాడు, అనంతపురం, బత్తలపల్లి మండలాల్లోని కొన్ని గ్రామాల రైతులు ముందుగా వారి చెరువులను నింపుకునే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే నార్పల మండలం బండ్లపల్లి పప్పూరు చెరువు రైతులు మళ్లించుకుంటున్నారనే విమర్శలున్నాయి. దీంతో చిట్ట చివరన ఉన్న మండల చెరువులకు నీరు చేరడం లేదు. నీటిపారుదల శాఖ అధికారులు, పోలీసులు సంయుక్తంగా కాల్వపై ప్రత్యేకంగా గస్తీ ఏర్పాటు చేసి కాల్వనీరు చౌర్యం కాకుండా ప్రత్యేక చర్యలు చేపడితే తప్ప మండల చెరువులకు నీరు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి నీరు విడుదలపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

భూగర్భ జలాలు పెరుగుతాయి



పీఏబీఆర్ కుడికాల్వ ద్వారా విడుదల చేసిన నీటిని మండల చెరువులకు సక్రమంగా సరఫరా చేయాలి. దీంతో బోరు బావుల్లో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. పోలీసులు, నీటి పారుదల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి మండల చెరువులు అన్నింటిని నింపాలి.

–బీ.చిన్నగంగిరెడ్డి, తాడిమర్రి

ప్రజా ప్రతినిధులు, అధికారులకు చిత్తశుద్ధిలేదు



మండల చెరువులకు పీఏబీఆర్ కుడి కాల్వ నీటిని సరఫరా చేయడంలో ఇటు ప్రజా ప్రతినిధులకు కాని అటు మండల అధికారులకు కాని చిత్తశుద్ధి లేదు. పీఏబీఆర్ నీరు విడుదల చేసి **పది రోజులు** గడుస్తున్నా ఇప్పటికీ ఎం.అగ్రహారం చెరువులో పెద్ద గొయ్యిలోకి రావడం లేదు. నిబంధనల ప్రకారం చివర ఉన్న మండల చెరువులను నింపుతూ వెళ్లాల్సి ఉండగా ఎగువ ప్రాంతంలో రైతులు వారి చెరువులకు మళ్లించడంతో మండలానికి నీరు అరకొరగా వస్తోంది.

–గోపాల్, ఎం.అగ్రహారం, తాడిమర్రి

షెడ్యూల్ ప్రకారమే సరఫరా చేస్తాం



జిల్లా కలెక్టర్, నీటి పారుదల శాఖ ఎస్‌ఈ ఆదేశాల మేరకు షెడ్యూల్ ప్రకారమే నీటిని సరఫరా చేస్తాం. షెడ్యూల్ ప్రకారం ఉమ్మడి అనంతపురం జిల్లా సరిహద్దులో ఉన్న తాడిమర్రి మండలంలోని చెరువులను నింపుతూ వెళ్లాల్సింది. తాడిమర్రి మండల చెరువులు నింపడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాం. అయితే బండ్లపల్లి పప్పూరు గ్రామ రైతులు **కాల్వనీటి** వారి చెరువులకు మళ్లించుకున్నారు. విషయం తెలుసుకుని ఎస్‌ఈ, డీసీలతో కలసి వెళ్లి ఆ రైతులతో మాట్లాడి అవగాహన కల్పించి అక్కడికి వెళ్లకుండా బంద్ చేయించారు. ప్రస్తుతం కాల్వ నిండుగా తాడిమర్రి చెరువులకు నీరు వెళుతోంది.

–పీ.రెడ్డెప్పరెడ్డి, టీబీపీ హెచ్‌ఎల్సీ డీఈ, అనంతపురం.

బత్తలపల్లిని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

బత్తలపల్లి: మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎస్సీ కాలనీలో ఆర్డీటీ కమ్యూనిటీహాల్‌లో సీపీఐ గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ పంటలు సాగు చేసిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం రైతులకు బీమాతోపాటు ఇన్‌పుట్ సబ్సిడీ ఎకరాకు రూ.20 వేలు చెల్లించాలన్నారు. బత్తలపల్లిలో హిందూ శ్మశాన వాటిక ఏర్పాటుకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. మండలంలో పీఏబిఆర్ కుడి కాలువ కింద ఉన్న చెరువు, కుంటలన్నింటికీ నీరు ఇవ్వాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మాల్యవంతం కుళ్లాయప్ప, మండల కార్యదర్శి బండల వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం,



మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు

రైతు సంఘం మండల కార్యదర్శి బత్తల నాగభూషణ, రామకృష్ణ, పూజారి రామాంజనేయులు, ఆదెప్ప, తాడిమర్రి మండల కార్యదర్శి దాసు చౌడప్ప, వడ్డె సన్నపెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

కంది పంట పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

బత్తలపల్లి: మండలంలోని 11 గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గురువారం వ్యవసాయాధికారులు కంది పంటలను పరిశీలించారు. గురువారం 'సాక్షి'లో 'కంది పోతోంది..!' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. జిల్లా వ్యవసాయాధికారులు ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ వ్యవసాయ సిబ్బందితో కలిసి ఏఓ ఓబిరెడ్డి పర్యటించి కంది పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా లింగారెడ్డిపల్లిలోని కలుగూరి కుళ్లాయప్ప, బత్తలపల్లిలోని బిల్లే పెదయ్యతో కలిసి వారి పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 6,020 ఎకరాల్లో కంది పంట సాగైందన్నారు. జూన్‌లో సాగు చేసిన కంది పంట ప్రస్తుతం కాయ, ఎదుగుదల దశలో ఉందని, జూలైలో సాగు చేసిన పంట పూతదశలో ఉందన్నారు. వాతావరణ పరిస్థితుల ప్రభావం వలన కొన్ని చోట్ల చీడపీడల ఉధృతి గమనించినట్లు తెలిపారు. అక్కడక్కడ మారుక మచ్చల పురుగు పంటను ఆశించినట్లు గుర్తించామన్నారు. కంది పంటను రక్షించుకునేందుకు అసిఫేట్ 1 గ్రాము లీటర్ నీటిలో, తాయోడికార్బ్ 1.5 గ్రాము లీటర్ నీటిలోనూ, ఫ్లూబెండమైడ్ 0.3 మి.లీ లీటరు నీటితో పాటు డై క్లోరోవాస్ 1మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.



లింగారెడ్డిపల్లిలో రైతు కుళ్లాయప్పతో కంది పంట వివరాలు తెలుసుకుంటున్న ఏఓ ఓబిరెడ్డి

పరీక్ష పేపర్ల బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి

కదిరి అర్బన్: భవిష్యత్తులో పరీక్ష పేపర్లను పాఠశాలకు చేర్చే బాధ్యతను పూర్తిగా ప్రభుత్వం తీసుకోవాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం తలుపులపల్లి జెడ్పీ హైస్కూల్ బయోలాజికల్ అసిస్టెంట్ సిద్దయ్యశెట్టి పరీక్ష పేపర్లను పాఠశాలను తీసుకెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై గురువారం స్థానిక ఎమ్మార్సీ వద్ద సంతాపం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేపర్‌లీక్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. భవిష్యత్తులో పరీక్ష పేపర్లను పాఠశాలలకు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ అధికారుల కక్షధోరణి మానుకోవాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జయచంద్రారెడ్డి, సుధాకర్, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్సీ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

రబీ పంటలకు బీమా చేయించుకోండి

ధర్మవరం రూరల్: రబీలో సాగు చేసిన పంటలకు బీమా చేయించుకోవాలని వ్యవసాయాధికారి ముస్తఫా రైతులకు సూచించారు. గురువారం చిగిచెర్ల గ్రామంలో బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. మీ సేవా కేంద్రం, కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో బీమా చేయించుకోవచ్చునన్నారు. వేరుశనగ పంటకు ఎకరానికి రూ.480, వరికి రూ.638, మామిడి ఎకరాకు రూ.1800, టమాటకు ఎకరానికి రూ.1600లను ఈ నెల 31లోపు చెల్లించాల్సి ఉందన్నారు. అనంతరం గ్రామంలో సాగు చేసిన కంది పంటను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ భార్గవ, ఏఐసీ కంపెనీ బీమా ప్రతినిధి చాంద్‌బాషా, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ ముస్తఫా

జాతీయ స్థాయి పోటీలకు కదిరి విద్యార్థిని



విద్యార్థినితో ప్రిన్సిపాల్ స్మిత

కదిరి అర్బన్: తమిళనాడులోని దిండిగల్‌లో ఈ నెల 23 నుంచి 27 వరకు జరిగే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఝాన్సీరాణి ఎంపికైంది. తమ కళాశాల విద్యార్థి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డి. స్మిత, పీడీ నరసింహాచారి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఝాన్సీరాణి గత ఆగస్టులో జరిగిన అండర్–19 బాలికల విభాగం రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో గోల్‌కీపర్‌గా రాణించింది.

కేసు నమోదు

కదిరి టౌన్: పట్టణంలో స్కూటీ అపహరణపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..కదిరి మండలం సున్నపుగుట్ట తండా నివాసి అయిన వెంకటేష్ నాయక్ భార్యతో కలిసి 20 రోజుల క్రితం కదిరికి వచ్చారు. పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్ వద్ద స్కూటీ ఉంచి లోపలకు వెళ్లొచ్చేలోపు వాహనం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల: పట్టణంలోని బేతాళం చర్చి వీధిలో ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు తెలిపిన వివరాలు..బేతాళం చర్చి వీధిలో నివాసం ఉంటున్న స్పందన గురువారం ఇంట్లో యాసిడ్ తాగింది. చుట్టు పక్కలవారు, సమీప బంధువులు గమనించి ఆమెను వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో హిందూపురం తీసుకెళ్లారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: గ్రామీణ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వుండాలని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. గురువారం రాత్రి వెంకటతిమ్మాపురం, దర్శనమల గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గొడవలకు దూరంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పేకాట, మద్యానికి బానిస కాకూడదన్నారు.

ఎన్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా గడ్డం నారాయణ



కనగానపల్లి/అనంతపురం టవర్‌క్లాక్: నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్‌టీఎఫ్) రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా మండలంలోని వేపకుంట గ్రామానికి చెందిన గడ్డం నారాయణ ఎంపికయ్యారు. ఈ మేరకు ఎన్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం నారాయణ మాట్లాడుతూ.. ఎన్‌టీఎఫ్ ఆధ్వర్యంలో ఎరుకల కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎరుకల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఎన్‌టీఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు జిల్లా, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గాయపడిన పక్షికి వైద్యం

బత్తలపల్లి: గాయపడిన పక్షికి పశువైద్యులు వైద్యం అందించి కాపాడారు. వివరాలు.. బత్తలపల్లికి చెందిన జొన్నలగడ్డ రంగానాయుడు పొలం వద్దకు వెళ్లి ఇంటికి వస్తుండగా వాహనం ఢీ కొని దెబ్బ తీవ్రంగా గాయపడిన పక్షిని గుర్తించాడు. వెంటనే బత్తలపల్లిలోని ప్రభుత్వ పశువైద్యశాలకు చేరుకున్నాడు. అక్కడ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, సురేష్‌నాయక్ పరిశీలించి వైద్యం చేశారు. కంఠం నీలంగా మెరిసిపోతుండడంతో పక్షిని నీలకంఠంగా పిలుస్తుంటారని పశు వైద్యులు పేర్కొన్నారు.



గాయపడిన పక్షి



పక్షికి వైద్యం అందిస్తున్న పశువైద్యాధికారులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

తనకల్లు: కొక్కంటిక్రాస్ పెట్రోల్ బంకు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు...పడమటివారిపల్లికి చెందిన ఆనంద్ బైక్‌పై మండల కేంద్రానికి బయలుదేరాడు. అయితే పెట్రోల్ బంకు దగ్గరకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీ కొని ఆపకుండా వెళ్లిపోయింది. బైక్ నుంచి రోడ్డుపై పడడంతో ఆనంద్ కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు అశోక్, నవీన్, విశ్వనాథ్, శీనప్ప తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రున్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

22న గణిత ప్రతిభా పరీక్ష

కదిరి అర్బన్: స్థానిక ఎస్ఎంజేఎస్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజమ్ జన్మదినాన్ని పురస్కరించుకుని విశ్వ సైనిక్ అండ్ నవోదయ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో గణిత ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షకు 5వ తరగతి నుంచి 8వ తరగతి చదివే విద్యార్థులు అర్హులన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు తృతీయ బహుమతి రూ.5 వేలు అందజేయనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు 8688888802,7989706484 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని నిజాంవలీ కాలనీకి చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..నిజాంవలీ కాలనీకి చెందిన శివప్రసాద్(32) బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిస కావడంతో తల్లిదండ్రులు మందలించారు. తీవ్ర మనస్థాపానికి గురైన అతడు ఈనెల 7న ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పునకు లుంగీతో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కిందికి దింపి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. చికిత్స ఫలించకపోవడంతో గురువారం మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.


పోలీసుల 'పల్లెనిద్ర'



గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కదిరి అర్బన్: చిప్పలమడుగు గ్రామంలో గురువారం రాత్రి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ నిరంజన్ రెడ్డి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు రోడ్డు భద్రత, హెల్మెట్ వాడకం, డ్రగ్స్, సెల్‌ఫోన్ ప్రభావం, సైబర్, ఏటీఎం నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుంటే తనకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేస్తున్న హరినాథరెడ్డి

ఓడీచెరువు: అయ్యప్ప మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేయడం పుణ్యకార్యంగా భావిస్తున్నట్లు గురుస్వామి పచ్చర్ల ఆంజనేయులు తెలిపారు. ఎం.కొత్తపల్లి బండపై వెలసిన శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో మాలధారులకు ఎం.బి. క్రాస్‌కు చెందిన శిరగం హరినాథరెడ్డి భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హరినాథరెడ్డి కుటుంబ సభ్యులు, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం

ఎన్పీకుంట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు వైద్యసేవలు అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని హెల్త్ సూపర్‌వైజర్ మహేశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం దిగువతూపల్లికి చెందిన శివన్న అనే వ్యక్తి డయేరియాతో బాధపడుతూ వైద్యసేవల కోసం ఆసుపత్రికి వస్తే ఆయనకు అటెండర్ ఎవరూ లేరని వైద్యం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్టాఫ్‌నర్స్‌పై ఆయన మండిపడ్డారు. ఆయనకు ఎవరూ లేరని, తాను అటెండర్‌గా ఉంటానన్నా వైద్యసేవలు అందించలేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో విధులు నిర్వహించే అధికారులకే విలువ ఇవ్వకుంటే సామాన్యులకు ఏం విలువ ఇస్తారని ప్రశ్నించారు. ఈ విషయమై రెండో వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌వర్ధన్, సూపర్‌వైజర్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

ఆన్‌లైన్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మగ్బూల్ హుస్సేన్

పుట్టపర్తి: ఆన్‌లైన్ లావాదేవీలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మగ్బూల్ హుస్సేన్, వినియోగదారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి సురేష్ సూచించారు. గురువారం బుక్కపట్నం డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ లావాదేవీలపై అవగాహన సమావేశం నిర్వహించారు. వినియోగ దారులు నిత్యం ఆన్‌లైన్‌లో ఖరీదైన వస్తువులు కొనుగోలు చేస్తుంటారని, అలాంటి సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.